

# కంగ్టి పీహెచ్‌సీని సందర్శించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



# సిద్దిపేట సంగారెడ్డి మెదక్

శుక్రవారం 10 జూలై 2026 పేజీలు : 8

## అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌తో
# ఉద్యోగ అవకాశాలు

**అంతర్జాతీయ స్థాయి ఉద్యోగాలకు అర్హులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**నారాయణఖేడ్‌లో రూ.47 కోట్లతో ఏటీసీకి శంకుస్థాపన : మంత్రి వివేక్ వెంకటస్వామి**



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జులై 9:** మారుతున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు అత్యాధునిక సాంకేతిక శిక్షణ అందించి, అంతర్జాతీయ స్థాయి ఉద్యోగాలకు అర్హులుగా తీర్చిదిద్దే లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి, సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. నారాయణఖేడ్ మండలంలోని జూకల్ శివారులో రూ.47 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)కి - మిగతా3లో

## టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ
# ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన బండారు యాదగిరి
- ప్రధాన కార్యదర్శిగా అనీల్
- కోశాధికారిగా అన్వర్
- ఎలక్ట్రానిక్ విభాగం అధ్యక్షుడిగా ఆసిఫ్ ప్రధాన కార్యదర్శిగా బసవేశ్వర్
- చిన్న మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడిగా సిద్ధిక్ ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్ చవాన్




# వ్యర్థాలు తగలబెట్టడంతో దుర్వాసన

- ఓ ఫుడ్ పరిశ్రమకు సంబంధించి ఎక్స్పైడ్ డేట్ అయిపోయిన ప్యాకింగ్ ప్యాకెట్లను తగలబెడుతున్నారు
- వ్యర్థాల దుర్వాసనతో రోడ్డు పక్క నుంచి వెళ్లలేక పోతున్నాం
- ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు శూన్యం







మనోహరాబాద్, జూలై 09 ( ప్రజా జ్యోతి ) మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కళ్లకల్, టి జి ఐ ఐ సి పారిశ్రామిక వాడలో బుధవారం రాత్రి ఓ ఫుడ్ పరిశ్రమకు చెందిన ఎక్స్పై డేట్ అయిపోయిన ప్యాకెట్లను రోడ్డు పక్కనే తగలబెట్టడంతో విపరీతమైన దుర్వాసన వెదజల్లుతుంది. ఈ వ్యర్థాలు రాత్రివేళలో తగలబెట్టడంతో పరిశ్రమలలో పని చేసుకుని తిరిగి ఇంటికి వస్తున్న కార్మికులకు ఈ దుర్వాసనతో ముక్కు గొంతులు పట్టేసి తలనొప్పిగా ఏర్పడుతున్నదని కార్మికులు ఆరోపిస్తున్నారు. అసలే వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు తోడు ఈ దుర్వాసన వల్ల రోగాల బారిన పడుతున్నామని పాదాచార్యులు వాహనదారులు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటన్నిటికీ కారణం ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు శూన్యం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. రాత్రి వ్యర్థాలను తగలబెడితే ఉదయం పరిశ్రమలకు ఉపాధి కోసం వెళుతుంటే దుర్వాసన తట్టుకోలేక పోతున్నామని కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్డు పక్కన వ్యర్థాలను తగలబెట్టకుండా ఫుడ్ ఇన్స్పెక్టర్ టి జి ఐ ఐ సి వాళ్లు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# శ్రీ గురు పీఠంలో గురువారం ప్రత్యేక పూజలు

--అన్న వితరణ కార్యక్రమం నిర్వహించిన కొడకంచి కృష్ణవేణి శ్రీనివాస్ గౌడ్ దంపతులు



**శివ్వంపేట ప్రజాజ్యోతి జూలై 09:** శ్రీ గురు పీఠంలోని దత్తాత్రేయ మహాస్వామి పంచాయతన దేవాలయం,శ్రీ షిరిడి సాయినాథ దేవాలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనంలో అభిషేకం, అర్చన కార్యక్రమాలు జరిగాయి.షిరిడి సాయిబాబా దేవాలయంలో కాకడ హారతి,మధ్యాహ్న హారతి నిర్వహించారు. శాస్త్రుల నటరాజ్ శర్మ,శాస్త్రుల శ్రీహర్ష ఆధ్వర్యంలో పూజలు జరిగాయి, ఈ కార్యక్రమంలో గురు పీఠం ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్ తో పాటు గూడూరు గ్రామ సర్పంచ్ బేగరి నర్సయ్య,మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్ గౌడ్, గడ్డమీద కృష్ణ గౌడ్,బాసంపల్లి శ్రీనివాస్ గౌడ్,సుదర్శన్ గౌడ్, కొడకంచి రవి గౌడ్, కొడకంచి నర్సింలు గౌడ్,సాయి గౌడ్,,శ్రీ గురు పీఠం సమన్వయకర్త కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్,తదితరులు హాజరయ్యారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.పూజా కార్యక్రమం అనంతరం కొడకంచి కృష్ణవేణి శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సభ్యులు అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు

# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న సర్పంచ్ సునీత మహిపాల్



**అందోల్, (ప్రజాజ్యోతి):** పేదలకు పక్కా ఇల్లు కల్పించడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిజమైన సంక్షేమం సాధ్యమవుతోందని సర్పంచ్ సునీత మహిపాల్ అన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు నక్క వినోద నూతన గృహప్రవేశ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేరి వెంకటరెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సునితా మహిపాల్, శేరి వెంకటరెడ్డి లు మాట్లాడుతూ, రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో గ్రామాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. పేదల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు సొంతింటి కల నెరవేరుతోందని పేర్కొన్నారు. గృహప్రవేశం సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయులకు దిశా నిర్దేశం చేసిన ఎంఈఓ బుచ్చా నాయక్



**శివ్వంపేట ప్రజాజ్యోతి జూలై 09:** శివ్వంపేట మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో గురువారం అన్ని గ్రామాల పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి మండల విద్యాధికారి బుచ్చా నాయక్ అధ్యక్షత వహించి పలు సూచనలు చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పాఠశాలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల పై ప్రధానోపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు.ఈ నెల 13వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమం గురించి వివరాలను ఆరోగ్య శాఖ డాక్టర్ శ్యామల వివరించారు.ఆ రోజు హాజరు కాని విద్యార్థుల కోసం ఈ నెల 20వ తేదీన రెండో రౌండ్ నిర్వహిస్తామని అధికారులు స్పష్టం చేశారు.అర్హులైన ప్రతి విద్యార్థికి మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బుచ్చా నాయక్,ఆరోగ్య సిబ్బంది,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# దంతాన్‌పల్లి అంగన్వాడీ పిల్లలకు బ్యాగ్స్,బుక్స్ పంపిణీ



**శివ్వంపేట ప్రజాజ్యోతి జూలై 09:** శివ్వంపేట మండలం దంతాన్‌పల్లి గ్రామ అంగన్వాడీ పాఠశాలలో గురువారం సిరి సీడ్స్ యజమాని రాకేష్ రెడ్డి సహకారంతో పిల్లలకు బ్యాగ్స్,పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గజేంద్రుల మమత నర్సింలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ పిల్లలకు సిరి సీడ్స్ యజమాని రాకేష్ రెడ్డి స్వయంగా బ్యాగ్స్,బుక్స్ అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని పిల్లల చదువుకు తోడ్పాటు అందించిన సిరి సీడ్స్ యజమాని రాకేష్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల,హెచ్,ఎం సత్యం సార్,ఉపాధ్యాయురాలు కవిత టీచర్,అంగన్వాడీ టీచర్ జాలజ,పిల్లల తల్లులు,గ్రామస్తులు గొల్ల దుర్గయ్య,కన్నారం కృష్ణ,కన్నారం స్వామి,కన్నారం కుమార్,జీపీ వర్కర్స్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వెంటనే స్టీల్ పరిశ్రమ వ్యక్తివేయాలి బి.ఆర్.ఎస్ నాయకుల డిమాండ్...

- పరిశ్రమ కాలుష్యం వల్ల రెండు గ్రామాల ప్రజలకు వ్యాధులు
- ప్రజాభిప్రాయ సేకరణ మరొక్కసారి నిర్వహించాలి
- పరిశ్రమ వల్ల నష్టపోతున్న రెండు గ్రామాల రైతులు
- మాజీ ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి



**మనోహరాబాద్, జూలై 09 ( ప్రజా జ్యోతి)** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని రంగయ్యపల్లి చెట్ల గౌరారం గ్రామాలకు ఆనుకొని ఉన్న ఎమ్మెస్ ఫౌండేషన్ స్టీల్ పరిశ్రమను వెంటనే ఎత్తివేయాలని మాజీ ఎఫ్ డి సి చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం, విలేకరులతో మాట్లాడుతూ రంగయ్యపల్లి చెట్ల గ్రామాల రైతులు స్టీల్ పరిశ్రమ వల్ల వచ్చే పొల్యూషన్ వల్ల పంటలు పండించలేక వ్యాధి బారిన పడుతున్నారని ఈ రెండు గ్రామాల్లో బోరు నుంచి వచ్చే నీళ్లు తాగలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే స్టీల్ పరిశ్రమ ఎత్తివేసేంతవరకు ఉద్యమం ఆపకొమని ఒక్కరోజు నిరాహార దీక్ష కూడా చేస్తామని మాజీ ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి తెలిపారు. కాలుష్యం వల్ల ఇబ్బందులు జరుగుతూ పరిశ్రమలో సేఫ్టీ లేక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ప్రమాదాల బారిన పడ్డ పరిశ్రమ యజమాన్యం పట్టించుకోకపోవడంతో ఈ రెండు గ్రామాలకు చెందిన వారు పరిశ్రమ యజమాని అడగగా కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని రంగయ్యపల్లి చెట్ల గౌరవం ప్రజలు పరిశ్రమ వైపు చూస్తే చాలు కేసులు పెట్టే పరిస్థితి ఉందని ప్రజలు భయాందోళన గురవుతున్నారని ఆయన అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు పోలీసుల బందోబస్తుతో సేకర నిర్వహించారని ఇది తెలుసుకొని జిల్లా జాయింట్ కలెక్టర్కు రెండు గ్రామాల సమస్యలు తెలపడానికి వస్తే ఇక్కడ పోలీసులు అరెస్టు చేశారని ప్రతాప్ రెడ్డి వాక్యానించారు. వెంటనే స్టీల్ పరిశ్రమ మూసి వేయకపోతే ఉద్యమం తప్పదని ఒక్కరోజు నిరాహార దీక్ష కూడా చేస్తామని మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇమాంపూర్ శేఖర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పంజాబీక్షపతి, లక్ష్మణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# బీబీపేట్‌లో అంగన్వాడీ టీచర్ పోస్టుకు నోటిఫికేషన్ విడుదల



**కల్హే ర్ /బీబీపేట్, జూలై 9:.** ప్రజా జ్యోతి సంగారెడ్డి జిల్లా లోని కల్హే ర్ మండలం బీబీపేట్ గ్రామ పంచాయతీ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ పోస్టు భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను గ్రామ పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డుపై ప్రదర్శించినట్లు పంచాయతీ కార్యదర్శి రంగయ్య తెలిపారు.

ఈ పోస్టును ప్రభుత్వ నిబంధనల ప్రకారం బీసీ–ఈ (బి సీ –ఈ) వర్గానికి చెందిన మహిళా అభ్యర్థుల కోసం కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలు, గడువులను పరిశీలించి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎం ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



**కల్హ్ ర్.9.జూలై.ప్రజా జ్యోతి** నిజాంపేట్, నారాయణఖేడ్.కల్హ్ ర్.మండలాల్లో నిర్వహించిన వివాహ వేడుకలకు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. నిజాంపేట్ మండలం ర్యాలమడుగు మాణిక్ నాయక్ తాండా ఉపసర్పంచ్ రమేష్ వివాహం, రామ్‌రెడ్డిపేట గ్రామానికి చెందిన లక్ష్మయ్య కుమార్తె వివాహం, దర్గా తాండాకు చెందిన కిషన్ నాయక్ కుమారుని వివాహం, అలాగే నారాయణఖేడ్ మండలం ర్యాకల్ గ్రామానికి చెందిన మారుతి రెడ్డి కుమారుని వివాహ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ రెడ్డి, సర్పంచ్ ఈశ్వర్, మాజీ సర్పంచ్లు మాణిక్ రెడ్డి, రాజు నాయక్, రవీందర్ నాయక్, నాయకులు జనార్దన్ రెడ్డి, అశోక్, మల్కొండ, సర్దార్ నాయక్, బంగార్రాజు, కమ్మరి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్‌లో 'ఎస్ఐఆర్' కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



**కల్హ్ ర్. 9.జూలై. ప్రజాజ్యోతి** ఖానాపూర్: కల్హేర్ మండలం ఖానాపూర్ గ్రామంలో నిర్వహించిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) కార్యక్రమంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను నమోదు చేయించారు. అనంతరం మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకుని ఓటరు జాబితా సంపూర్ణంగా, పారదర్శకంగా రూపొందేందుకు సహకరించాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటరు నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేసుకోవాలని సూచించారు.

## అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌తో ఉద్యోగ అవకాశాలు

-మొదటిపేజీ తరువాయి

గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరుద్యోగ యువతకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ అందించి, ప్రపంచ స్థాయి పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందేలా తీర్చిదిద్దడమే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా నారాయణఖేడ్ ప్రాంత యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసే శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంత యువతకు నగరాలకు వెళ్లకుండానే ఆధునిక సాంకేతిక శిక్షణ అందుబాటులోకి రావడం ఎంతో శుభపరిణామమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించి యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. నారాయణఖేడ్ ప్రాంత అభివృద్ధికి అవసరమైన ప్రతి ప్రాజెక్టుకు తన పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. వెనుకబడిన ప్రాంతమైన నారాయణఖేడ్‌లో ఇలాంటి ప్రతిష్టాత్మక సాంకేతిక శిక్షణ కేంద్రం ఏర్పాటు కావడం యువతకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామీణ విద్యార్థులు సైతం ఆధునిక సాంకేతిక నైపుణ్యాన్ని సాధించి మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని పేర్కొన్నారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను మంజూరు చేసిన ముఖ్యమంత్రి, కార్మిక శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మరియు శిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వాస్లే, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్ వి. ప్రశాంతి, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కల్హేర్‌లో శ్రీరామ మందిర తృతీయ వార్షికోత్సవం. శుక్రవారం నుంచి ప్రారంభం




**కల్హేర్, జూలై 9. ప్రజా జ్యోతి** కల్హేర్ గ్రామంలోని శ్రీరామ మందిర తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జూలై 10, 2026న ఆలయ ప్రాంగణంలో వైభవంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు. ఉదయం 6.00 గంటలకు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, మహా హారతి నిర్వహించడంతో పాటు పట్టు వస్త్రాలతో స్వామివారి ఉరేగింపు జరగనుంది. అనంతరం ఉదయం 11.00 గంటలకు శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం వైదిక పండితుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతుంది. మధ్యాహ్నం 1.00 గంటలకు మహా అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందాలని కల్హేర్ గ్రామ ప్రజలు ఆహ్వానించారు.

## టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:

టియుడబ్ల్యూజే(ఐజేయు) సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడిగా బందారు యాదగిరి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్ లో గురువారం జిల్లా మహాసభను నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రధాన కార్యదర్శి రామనారాయణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైసల్ అహ్మద్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం ఇతర ముఖ్య నేతలు ఈ మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బందారు యాదగిరి ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రు మాండ్ల అనిల్, ఉపాధ్యక్షులుగా శ్రీనాథ్ మతీన్,ఆర్ సత్యనారాయణ రెడ్డి,కిషోర్ , మల్లేశం, కోశాధికారిగా అన్వర్, జాయింట్ సెక్రటరీలుగా ఉల్లిగడ్డల శివకుమార్ , శ్రీనివాసరెడ్డి ,డి సుమన్, వెంకటేష్ ,ఎంఏ రవూఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా విలాస్ విల్సన్ ,అంజయ్య ,ఉల్వల రాజు, రఫీఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా సంగమేశ్వర్ ,హాసిల్, శివన్న జైన్,సత్తార్ ఖాన్ ,హబీబ్ ఉద్దీన్ ,ఆర్ విజయ రాజు, బాలయ్య, శ్రీనివాస్ ,సత్యం, ఇర్ఫాన్, ప్రభాకర్ వెంకటేశం, మాజిద్ అలీ, మహబూబ్ ఘోరీ, ముజాహిద్, అబ్దుల్ హై లను ఎన్నుకున్నారు. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అధ్యక్షునిగా ఆసిఫ్, ఉపాధ్యక్షునిగా హెచ్ఎంటీవీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బసవేశ్వర్, కోశాధికారిగా శ్రీధర్ జైన్, జాయింట్ సెక్రటరీగా భూపాల్ రెడ్డి ఎన్నికయ్యారు. చిన్న , మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడిగా సిద్దిక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా జవాన్ ఈశ్వర్, కోశాధికారిగా లక్ష్మణ్ , ఉపాధ్యక్షుడిగా నజీర్ ఎన్నికయ్యారు.

## కల్హేర్‌లో పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**కల్హేర్ , జూలై 9:** ప్రజా జ్యోతి కల్హేర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులు, విద్యారంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతూ, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పీఆర్టీయూ సభ్యత్వాన్ని స్వీకరించి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షులు రామ్మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, గౌరవ అధ్యక్షులు గోవర్ధన్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మారుతి, సంజీవ్ కుమార్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేటకు సొంత సబ్ రిజిస్ట్రార్ భవనం





రూ.2 కోట్లతో ఆధునిక కార్యాలయ నిర్మాణానికి ఆమోదం

మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో నిధుల మంజూరు..

ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవల దిశగా కీలక అడుగు

**అందోల్, (ప్రజాజ్యోతి):** అందోలు నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక మైలురాయిగా జోగిపేటలో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవతో ఈ నిధులు విడుదల కావడం స్థానికంగా హర్షాతిరేకానికి కారణమైంది. దశాబ్దాలుగా జోగిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రైవేట్ భవనంలోనే కొనసాగుతోంది. సరైన స్థలాభావం, పార్కింగ్, వేచిచూసే గదులు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు వంటి మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా భూముల రిజిస్ట్రేషన్లు, ఆస్తుల క్రయవిక్రయాలు, ఇతర నమోదు ప్రక్రియల కోసం వచ్చే ప్రజలు గంటల తరబడి అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 కోట్లతో అన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం నిర్మించనున్నారు. విశాలమైన కార్యాలయ గదులు, డిజిటల్ సేవలకు అనువైన మౌలిక సదుపాయాలు, ప్రజలకు సౌకర్యవంతమైన వేచిచూసే ప్రదేశాలు, పార్కింగ్, ఇతర అవసరమైన వసతులతో భవనాన్ని రూపొందించే అవకాశం ఉంది.

ఈ సందర్భంగా అందోలు--జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఎ. చిట్టిబాబు మాట్లాడుతూ.. జోగిపేట ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని అన్నారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన రిజిస్ట్రేషన్ సేవలు అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఈ భవన నిర్మాణం నిదర్శనమని పేర్కొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవతోనే ఈ నిధులు మంజూరయ్యాయని, అందుకు జోగిపేట ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ భవనం అందుబాటులోకి వస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందడంతో పాటు అందోలు నియోజకవర్గంలో ప్రభుత్వ మౌలిక వసతుల అభివృద్ధికి మరో గుర్తింపుగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. జోగిపేటలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మాణం చేపట్టడం ద్వారా ప్రభుత్వ సేవల నాణ్యత మరింత పెరగడంతో పాటు, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవల అందుబాటు మరింత సులభతరం కానుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజాస్వామ్యానికి జర్నలిజమే నాలుగో స్తంభం

వేగం కంటే విశ్వసనీయతకే అధిక ప్రాధాన్యం

మంత్రి దామోదర రాజనర్సింహ

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా




**సంగారెడ్డి (ప్రజాజ్యోతి) ప్రతినిధి:** ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి జర్నలిజం అత్యంత కీలకమైన నాలుగో స్తంభమని, వార్తల్లో వేగం అవసరమే అయినప్పటికీ విశ్వసనీయతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టీయుడబ్ల్యూజె) జిల్లా మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జర్నలిజం అనేది కేవలం వార్తలను అందించే వృత్తి మాత్రమే కాదని, ప్రజాస్వామ్య విలువలను కాపాడే సామాజిక బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. సత్యం, నైతికత, సామాజిక బాధ్యత అనే మూడు మూల సూత్రాలను జర్నలిజం ఎప్పటికీ విడిచిపెట్టకూడదని సూచించారు. ప్రజలకు వేగంగా సమాచారం అందించడం ఎంత ముఖ్యమో, అందించే సమాచారం వాస్తవమైనదిగా, విశ్వసనీయమైనదిగా ఉండటం అంతకంటే ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వారధిగా మీడియా పనిచేస్తోందని, ప్రజల గొంతుకగా సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తి జర్నలిస్టులదేనని మంత్రి కొనియాడారు. సమాజంలో జరిగే పరిణామాలను నిష్పాక్షికంగా ప్రజల ముందుంచే బాధ్యతను మీడియా సమర్థంగా నిర్వర్తిస్తోందని అన్నారు.జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. పాత్రికేయుల సంక్షేమం, వృత్తి భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పనిచేస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో జర్నలిస్టుల పాత్రను ప్రభుత్వం ఎల్లప్పుడూ గౌరవిస్తుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన జర్నలిస్టులు వృత్తిపరమైన సవాళ్లు, సంక్షేమ సమస్యలు, మీడియా రంగంలో వస్తున్న మార్పులపై చర్చించారు. పాత్రికేయుల ఐక్యత, వృత్తి విలువల పరిరక్షణ, సంక్షేమ అంశాలపై జిల్లా మహాసభలో పలు తీర్మానాలు చేసినట్లు సమాచారం.

మంత్రి చేసిన వ్యాఖ్యలు జర్నలిజంలో వేగం కంటే విశ్వసనీయత, సంచలనాల కంటే సత్యం, పోటీ కంటే నైతిక విలువలే ప్రధానమనే సందేశాన్ని మరోసారి స్పష్టంగా ప్రతిధ్వనింపజేశాయి. ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే స్వేచ్ఛాయుత, బాధ్యతాయుత, విశ్వసనీయ మీడియా వ్యవస్థ అత్యవసరమని ఈ మహాసభ వేదికగా మరోసారి నొక్కిచెప్పబడింది.

## కంగ్టి పీహెచ్‌సీని సందర్శించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 9: కంగ్టి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గురువారం సంయుక్తంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యే రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్యులు, ఆసుపత్రి సిబ్బందితో సమావేశమై ఆసుపత్రి పనితీరు, వైద్య సేవల అందుబాటు, మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందించాలని, మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కంగ్టి పీహెచ్‌సీలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సిబ్బంది కొరతను తీర్చాల్సిన అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రజలకు 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ నిబద్ధతతో వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఉమా హారతి, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్, మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

**-ఏడీఈ నాగిరెడ్డి**

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 10:** నారాయణఖేడ్ 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో జూలై 10 శుక్రవారం ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు పలు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) నారాయణఖేడ్ సహాయ విభాగ ఇంజినీర్ (ఏడీఈ) నాగిరెడ్డి తెలిపారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ..నారాయణఖేడ్ మున్సిపాలిటీతో పాటు పరిసర గ్రామాలు, కంగ్టి, సిర్గాపూర్, మనూర్, నాగల్‌గిద్ద, నిజాంపేట్ గ్రామాలలో పాటు ర్యాలమడుగు, నాగధర్ గ్రామాలలో విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ విద్యుత్ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, నిర్వహణ పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు.